

మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

- మళ్లీ కేసీఆరే కావాలంటున్న ప్రజలు
- పార్టీ కార్యకర్తల సమావేశంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు, జూన్ 6 : స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చని కార్యకర్తలందరూ ఐకమత్యంగా ఉండి ఎన్నికలకు సిద్ధం కావాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుచులాపూర్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ పల్లెకు వెళ్లినా ఏ వాడకు వెళ్లినా మళ్లీ కేసీఆర్ సారే ముఖ్యమంత్రి కావాలంటున్నారని అన్నారు. తమకు సమయానికి రైతు బంధు వేయాలని వేడుకుంటున్నారన్నారు. కనీసం 30 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ చేయలేదన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడైనా రావచ్చని, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణంతోపాటు కుచులాపూర్ టూ తలమడుగు రోడ్డు పనులతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు త్వరలోనే చేపడుతామన్నారు. పార్టీ సీనియర్ నాయకులు జనార్దన్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనార్దన్, పార్టీ కన్వీనర్ వెంకటేశ్, ముడుపు కేదారేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అభిరాంరెడ్డి, కిరణ్, మాజీ సర్పంచ్ దేవ్ రావ్, తోట శ్రీనివాస్, వామన్, రవీందర్, మల్లయ్య, రవికాంత్ యాదవ్, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్పెషల్ బ్రాంచ్ కార్యాలయం ప్రారంభం



స్పెషల్ బ్రాంచ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

ఎదులాపురం, జూన్ 6: ఆదిలాబాద్‌లో జిల్లా పోలీస్ ముఖ్య కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ ఆఫీస్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం ప్రారంభించారు. ముందుగా శిలాఫలకం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీసు యంత్రాంగానికి స్పెషల్ బ్రాంచ్ అనేది నిఘా వ్యవస్థలా పనిచేస్తుందన్నారు. సిబ్బంది కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ అనునిత్యం ప్రజల్లో ఉంటూ సమాచారాన్ని సేకరించి జిల్లా అధికారులకు అందించాలన్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఆపరేషన్స్) బీ సురేందర్ రావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, డీసీఆర్‌బీ డీఎస్పీ సీహెచ్ నాగేందర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పీ మోహన్, ఇన్‌స్పెక్టర్లు బీ సునీల్ కుమార్, సీహెచ్ కరుణాకర్ రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డీ వెంకటి, ఎస్ఐ అన్వర్ ఉల్ హక్, ఏఎస్ఐ సురేందర్, ఫరూఖ్ సిబ్బంది పాల్గొన్నారు.

# సన్నాలకు బోనస్ ఏది?





చివరి దశకు చేరుకున్న ధాన్యం కొనుగోళ్లు

- నేటికీ అందని బోనస్ డబ్బులు
- నిర్మల్ జిల్లాలో రూ.12.50 కోట్ల బకాయిలు
- ఎదురు చూస్తున్న 4,170 మంది రైతులు

*నిర్మల్ జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నాయి. మరికొన్ని రోజులు కొనుగోలు కేంద్రాలు కూడా మూతపడనున్నాయి. సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 చొప్పన బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ విడుదల చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడిస్తారో కూడా తెలియకపోవడంతో ఎదురు చూపులు తప్పడం లేదు.*

నిర్మల్, జూన్ 6(నమస్తే తెలంగాణ): నిర్మల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 260 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో నుంచి 171 సెంటర్లను ఇప్పటికే మూసేశారు. సన్నరకం ధాన్యాన్ని విక్రయించిన రైతులకు ఇప్పటి వరకు బోనస్ డబ్బులు అందలేదు. ధాన్యం డబ్బులు వారం, పది రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ అయినప్పటికీ బోనస్ డబ్బుల కోసం మాత్రం ఎదురు చూపులు తప్పడం లేదు. నిర్మల్ జిల్లాలో ఇప్పటి వరకు యాసంగి సీజన్‌కు సంబంధించి 25 వేల మెట్రిక్ టన్నుల సన్నరకం వడ్లను కొన్నారు. సన్నాలపై ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు జిల్లా రైతులకు రూ.12.50 కోట్లను చెల్లించాల్సి ఉన్నది. ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం బోనస్ చెల్లింపుల విషయంలో ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇందుకు సంబంధించి డబ్బులు కూడా విడుదల చేయకపోవడంతో ఈ సారి రైతులకు బోనస్ కూడా అందే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఈ యాసంగి సీజన్‌లో 1,17,085 ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఈ సీజన్‌లో 1.83 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇందులో 1.38లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డురకం వడ్లు, 24వేల మెట్రిక్ టన్నులు సన్నరకం వడ్ల దిగుబడులు వస్తాయని పంటల ప్రణాళికలో పేర్కొన్నారు. ఇందులో నుంచి కొంతవరకు స్థానిక అవసరాలకు పోను 1,62,414 మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయానికి వస్తుందని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. అందుకనుగుణంగా జిల్లాలో మొత్తం 330 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఇందులో ఐకేపీ సెంటర్లు 171, పీఏసీఎస్ కేంద్రాలు 147, డీసీఎంఎస్ 7, జీసీసీ ఆధ్వర్యంలో 5 సెంటర్లను ఏర్పాటు చేశారు. కాని కొనుగోళ్లు మాత్రం 260 కేంద్రాల ద్వారా చేపట్టారు. వీటిలో 131 ఐకేపీ సెంటర్లు, 112 పీఏసీఎస్, డీసీఎంఎస్ 13, జీసీసీ 4 కేంద్రాలు ఉన్నాయి. కాగా ఈ యాసంగి ధాన్యం సేకరణ మొత్తం లక్ష్యం 1,62,414 మెట్రిక్ టన్నులు కాగా ఈ సారి లక్ష్యానికి మించి ధాన్యం దిగుబడులు వచ్చాయి. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1,76,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో దొడ్డురకం 1,51,000 మెట్రిక్ టన్నులు కాగా, సన్నరకం 25 వేల మెట్రిక్ టన్నులుగా ఉన్నది. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం వరి కొనుగోళ్లు చివరి దశలో ఉన్నాయి. ఖానాపూర్, కడెం, దస్తురాబాద్, తదితర మండలాల్లో వరి కోతలు ఆలస్యం కావడంతో ఆయా మండలాల్లో మాత్రమే కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి 38,841 మంది రైతులకు రూ.267 కోట్లను చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.202 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఇంకా దాదాపు రూ.67 కోట్ల వరకు ధాన్యం డబ్బులను రైతులకు చెల్లించాల్సి ఉన్నది. వీటితో పాటు సన్నాలు విక్రయించిన రైతులకు చెల్లించాల్సిన రూ.12.50 కోట్ల బోనస్ డబ్బుల గురించి ప్రభుత్వం ఊసే ఎత్తడం లేదు.



సోన్ మండలం కడ్తాల్ కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యాన్ని తూకం వేస్తున్న హమాలీలు

## ప్రతిపాదనలు బుట్టదాఖలు

నిర్మల్ జిల్లాలో కొనుగోలు చేసిన సన్నరకం ధాన్యానికి సంబంధించి 4,170 మంది రైతులకు రూ.12.50 కోట్లను రైతులకు బోనస్‌గా చెల్లించాల్సి ఉన్నది. ఈ బోనస్ చెల్లించాలని ఎప్పటికప్పుడు కొనుగోలు వివరాలను తెలుపుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించినప్పటికీ ఇందుకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు వెలువడలేదు. జిల్లాలో ఇప్పటికీ రూ.267 కోట్ల విలువ చేసే దొడ్డు, సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందులో నుంచి రూ.202 కోట్ల చెల్లింపులు కూడా పూర్తయ్యాయి. కాని సన్నరకం ధాన్యానికి మాత్రం బోనస్ డబ్బులను చెల్లించక పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికే రుతుపవనాలు వచ్చి వానకాలం సాగు కోసం దుక్కులు దున్నుతున్న రైతులకు బోనస్ డబ్బులు వస్తే ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు. వానకాలంలో పండించిన సన్నాలకు బోనస్ అందడంతో ఈసారి కూడా బోనస్ డబ్బులు వస్తాయని రైతులు గంపెడాశతో మండు వేసవిలో సైతం సన్న వడ్లను సాగు చేశారు. సాగు నీటి ఇబ్బందులను అధిగమించి కేవలం బోనస్ వస్తుందన్న ఆశతో ధైర్యం చేసి సన్నాలను సాగు చేసిన రైతులకు ప్రస్తుతం ఎదురు చూపులు తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే బోనస్ చెల్లించాలని కోరుతున్నారు.

## బోనస్ డబ్బులు రూ.37 వేలు రాలేదు..



*నాకున్న 6 ఎకరాల పొలంలో మూడున్నర ఎకరాల్లో సన్నరకం వడ్లు వేసిన. 75 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో అమ్మిన. రూ.37వేల దాకా బోనస్ డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ అయితాయని చెప్పిన్రు. పంట అమ్మి దాదాపు నెల రోజులవుతున్నది. ఇప్పటి వరకు బోనస్ డబ్బులు రాలే. యాసంగిలో సాగు నీటికి తిప్పలయినా, బోనస్ వస్తుందన్న ఆశతో కష్టపడి సన్నరకం వడ్లను పండించిన. ప్రతిసారి ఎదురుచూపులు తప్పడం లేదు. రైతులంటే ఈ ప్రభుత్వానికి చిన్నచూపుగా ఉన్నది. కష్టపడి పండించిన పంట పైసలే సక్కగా ఇస్తలేరు. ఇంక రైతుబంధు ఇస్తరో ఇయ్యరో గ్యారెంటీ లేకుంటైంది.*

*-అశోక్, రైతు, సిద్ధాపూర్*

# బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో మైలారపు అడెల్లు మృతి

**2020లో జిల్లాలో విస్తృతంగా పర్యటన**

- మావోయిస్టు పార్టీలో యువతను చేర్చుకునేందుకు ప్రయత్నం
- మూడుసార్లు తృటిలో తప్పించుకున్న భాస్కర్
- ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచ్చెర వాసి



ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల ఇన్‌చార్జి మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు అడెల్లు 2020 జూన్‌లో ఆసిఫాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. అటవీ ప్రాంతాల్లోని మారుమూల గ్రామాల్లో పర్యటించి మావోయిస్టు పార్టీల్లో యువకులను చేర్చుకునేందుకు ప్రయత్నించారు. తిర్యాణి అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న గ్రేహౌండ్స్ దళాలు, ఇతర ప్రత్యేక పోలీసుల బలగాలకు మూడుసార్లు ఎదురుపడి తృటిలో తప్పించుకున్నారు. 2020 సెప్టెంబర్‌లో ఆసిఫాబాద్ మండలం చిలాటిగూడ అటవీ ప్రాంతంలోని చేలల్లో పోలీసులకు తారసపడి తృటిలో తప్పించుకుపోయారు. అప్పటి డీజీపీ మహేందర్ రెడ్డి జిల్లాలో ఆరు రోజుల పాటు మకాం వేసి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. దాదాపు మూడు నెలల పాటు గ్రేహౌండ్స్ దళాలు అడవులను జల్లెడ పట్టినప్పటికీ మావోయిస్టు నేత మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ పోలీసులకు చిక్కలేదు. ఈ ఘటనలు జరిగిన మూడు నెలలకు 2020 సెప్టెంబర్ 19న కాగజ్‌నగర్ ఈస్‌గాం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కదంబా అడవుల్లో ఇద్దరు మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. ఈ కాల్పుల్లో ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌కు చెందిన మావోయిస్టు చుక్కాలు, ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం అద్దాల తిమ్మాపూర్‌కు చెందిన జుగ్నాక బాజీరావు చనిపోయారు. ఈ ఎన్‌కౌంటర్‌లో కూడా మైలారపు అడెల్లు చాకచక్యంగా తప్పించుకున్నట్లు పోలీసులు భావించారు. శుక్రవారం ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృత్యువాత పడ్డారు. ప్రభుత్వం ఈయనపై రూ. 25 లక్షల రివార్డును ప్రకటించింది.

## స్వగ్రామం పొచ్చెరలో విషాదం..

బోథ్, జూన్ 6 : మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ మృతితో ఆయన స్వగ్రామమైన ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచ్చెర గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. 1996-97లో ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలో ఆర్ఎస్‌యూ (రాడికల్ స్టూడెంట్ యూనియన్)కు ఆకర్షితుడై అప్పటి నక్సలైట్ ఉద్యమంలో చేరాడు. మావోయిస్టు పార్టీలోని ఓ కీలక మహిళా నేతను పెండ్లి చేసుకున్నారు.



నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలోని మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ కార్యాలయం

# రైతులకు కుచ్చుటోపీ!

**కోటి రూపాయల బకాయిలు ఎగవేసి పరారైన రైతు ఉత్పత్తి దారుల సంస్థ సీఈవో**

- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన రైతులు

కుభీర్, జూన్ 6 : నిర్మల్ జిల్లా కుభీర్ మండలకేంద్రంలోని తమకు రావాల్సిన బకాయిలను చెల్లించకుండా పరారయ్యాడని మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ సంస్థ సీఈవో శ్రీనివాస్‌పై పోలీస్ స్టేషన్‌లో రైతులు ఫిర్యాదు చేసిన ఘటన శుక్రవారం జరిగింది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం..కుభీర్ మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ద్వారా గతేడాది నుంచి సుమారు 180 మంది మహిళా రైతులను చేర్చుకొని మక్క, సోయాబీన్, కందులు, జొన్నలను కొనుగోలు చేస్తున్నది. సంస్థ సీఈవో కుభీర్‌కు చెందిన వ్యక్తే కావడంతో నమ్మకంతో ఈ సంస్థకే వానకాలం, యాసంగి పంటలు మక్క, సోయాబీన్, కందులు, జొన్నలు రైతులు విక్రయించారు. పంటలకు సంబంధించిన కోటి రూపాయల బకాయిలను రైతులకు చెల్లించకుండా సీఈవో ఇబ్బంది పెడుతున్నాడు. ఈ విషయంపై గట్టిగా నిలదీయడంతో సీఈవో పరారయ్యాడని రైతులు తెలిపారు. సీఈవో శ్రీనివాస్‌పై శుక్రవారం కుభీర్ పోలీస్ స్టేషన్‌లో రైతులు ఫిర్యాదు చేసినట్లు భైంసా రూరల్ సీఐ నైలు నాయక్ తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి తమకు రావాల్సిన పంటల డబ్బులను ఇప్పించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

# ఆధార్ అవస్థలు

*ఆదిలాబాద్ జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు ఆధార్ అప్‌డేట్ కోసం అవస్థలు పడుతున్నారు. ఆధార్ సెంటర్లలో రద్దీతో పాటు సర్వర్లు పనిచేయకపోవడంతో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొన్నది. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలికి చెందిన గ్రామస్తులు తమ ఆధార్‌కార్డులు మార్పులు, చేర్పుల కోసం పోస్టాఫీస్‌లోని ఆధార్ కేంద్రానికి వచ్చారు. సర్వర్ సమస్య ఉందని నిర్వాహకులు తెలుపడంతో ఎండ వేడిని భరించలేక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సేద తీరారు.* - ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్ , జూన్ 6



ఆధార్ సెంటర్ వద్ద చెట్ల కింద పడిగాపులు కాస్తున్న మహిళలు



అందూర్‌లో బియ్యం కోసం లబ్దిదారుల పడిగాపులు

# రేషన్..పరేషాన్

**సిగ్నల్ అందక.. సర్వర్ బీజీతో లబ్ధిదారులకు ఇబ్బందులు**

బోథ్, జూన్ 6 : చౌకధరల దుకాణాల్లో సర్వర్ బీజీగా ఉండడం, సిగ్నల్ లేకపోవడంతో బియ్యం కోసం వచ్చిన రేషన్‌కార్డు లబ్ధిదారులకు తిప్పలు తప్పడం లేదు. మూడు నెలలకు సంబంధించి ఒకేసారి పంపిణీ చేస్తుండడంతో బోథ్ మండలంలోని రేషన్ షాపుల వద్ద బియ్యం కోసం వస్తున్న లబ్ధిదారులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నది. మూడు నెలలకు సంబంధించి ఒకేసారి అందిస్తుండడంతో పంపిణీలో ఆలస్యం జరుగుతుంది. ప్రతి కార్డుదారుడూ మూడు సార్లు వేలి ముద్రలు వేయాల్సి రావడం, సర్వర్ బీజీగా రావడం, సిగ్నల్ సరిగ్గా లేకపోవడంతో సకాలంలో బియ్యాన్ని అందుకోలేకపోతున్నారు. వేలి ముద్రలు పూర్తయ్యాక తూకం వేసే కాంటాకు ఏర్పాటు చేసిన డీవైజ్‌లో బ్లూ టూత్ ద్వారా వేలి ముద్ర పూర్తయినట్లు సమాచారం కూడా అక్కడక్కడ రాకపోతుండడంతో బియ్యాన్ని తెచ్చుకోలేకపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బియ్యం పంపిణీలో జాప్యం జరగకుండా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.